సాక్షి అన్నమయ్య జిల్లా

శనివారం । 22 । మార్చి । 2025



విఘ్నేశ్వరునికుంట కబ్జాకు యత్నాలు

కూటమిప్రభుత్వం అధికారంలోకి వచ్చాక కబ్జాలు పెరిగిపోతున్నాయి.మదనపల్లె మండలంలోని విఘ్నేశ్వరునికుంట కబ్జా చేసేందుకు తమ్ముళ్లు యత్నాలు ప్రారంభించారు. -8లో

రంజాన్ వేళలు

	ఇఫ్తార్ శని॥ (సా॥)	సహర్ ఆది॥ (ఉ॥)
రాయచోటి	6.31	4.57
రాజంపేట	6.29	5.05
పీలేరు	6.30	4.55
మదనపల్లె	6.32	4.59

మదనపల్లె : టమాటా ధరలు (10 కిలోలు)

	కనిష్టం	గరిష్టం
మొదటిరకం	రూ.90	రూ.110
రెండోరకం	రూ.60	రూ.80

మార్కెట్‌కు వచ్చిన మొత్తం సరుకు : 129 మెట్రిక్ టన్నులు



న్యూస్‌రీల్

వైఎస్ జగన్ పర్యటన రద్దు

రైల్వేకోడూరు అర్బన్: రైల్వేకోడూరులో ఈనెల 23వ తేదీన జరగాల్సిన మాజీ ముఖ్యమంత్రి, వైఎస్సార్‌సీపీ అధినేత వైఎస్ జగన్ మోహన్ రెడ్డి పర్యటన రద్దయింది. ఈ విషయాన్ని వైస్ ఎంపిపి రామిరెడ్డి ధ్వజారెడ్డి శుక్రవారం పేర్కొన్నారు. మళ్లీ పర్యటన ఎప్పుడు ఉంటుందో త్వరలో తెలియజేస్తామన్నారు.

హుండీ ఆదాయం లెక్కింపు

ఒంటిమిట్ట: ఒంటిమిట్ట శ్రీ కోదండరామ స్వామి ఆలయ హుండీ ఆదాయాన్ని శుక్రవారం ఆలయ టీటీడీ అధికారులు లెక్కించారు.నెలరోజులకు రూ.4,55,140 ఆదాయం వచ్చినట్లు అధికారులు వెల్లడించారు.

సర్పంచ్ చెక్ పవర్ రద్దు

పుల్లంపేట: పుల్లంపేట మండలం, జాగువారిపల్లి సర్పంచ్ వై రఘురామయ్య చెక్ పవర్ రద్దు చేస్తున్నట్లు ఏఓ శ్రీధర్‌రెడ్డి తెలిపారు. జాగువారిపల్లికి సంబంధించి రూ. 7.50 లక్షల నిధుల్లో అవినీతి జరిగిందని జిల్లా కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు.దీనిపై విచారణ చేపట్టి చెక్ పవర్ రద్దు చేసినట్లు ఏఓ పేర్కొన్నారు.

కురబలకోట ఇన్‌చార్జి ఎంపీపీగా భూదేవికి బాధ్యతలు



ఎంజి భూదేవి

కురబలకోట: కురబలకోట మండల పరిషత్ ఇన్‌చార్జి ఎంపీపీగా నందిరెడ్డిగారిపల్లె ఎంపీటీసీ, వైఎస్ ఎంపీపీ ఎంజి. భూదేవికి బాధ్యతలు అప్పగిస్తూ జిల్లా కలెక్టర్ చామకూరి శ్రీధర్ శుక్రవారం ఆదేశాలు జారీ చేశారు. రెండు రోజుల క్రితం ఎంపీపీ బి. దస్తగిరి అనారోగ్య కారణాలతో ఆరునెలలు సెలవులో వెళ్లిన విషయం తెలిసిందే. దీంతో గురువారం మండలంలోని మెజార్టీ ఎంపీటీసీలు సమావేశమై భూదేవిని ఇన్‌చార్జి ఎంపీపీగా ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ క్రమంలో జిల్లా కలెక్టర్ కూడా ఇన్‌చార్జి ఎంపీపీగా భూదేవికి బాధ్యతలు అప్పగిస్తూ ఆదేశాలు జారీ చేయడంతో అధికారికంగా మండల పగ్గాలు ఆమె చేతికి వచ్చాయి.

ఏకగ్రీవ ఎన్నిక



హనుమంతునాయుడికి ధ్రువీకరణపత్రాన్ని అందచేస్తున్న ఎన్నికల అధికారి సురేష్‌కుమార్

రాజంపేట: రాజంపేట బార్ అసోసియేషన్ అధ్యక్షుడిగా సీనియర్ న్యాయవాది పచ్చా హనుమంతునాయుడు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఈమేరకు ఎన్నికల సీఈవో సురేష్ కుమార్, సహాయ ఎన్నికల అధికారి గోవర్ధన్ రెడ్డి శుక్రవారం ధ్రు వీకరణపత్రాన్ని అందచేశారు. బార్ అసోసియేషన్ ప్రధానకార్యదర్శిగా జాఫర్‌బాషా ఎన్నికయ్యారు. కార్యక్రమంలో బార్‌అసోసియేషన్ మాజీ అధ్యక్షుడు కొండూరు శరత్‌కుమార్‌రాజు, న్యాయవాదులు నాసరుద్దీన్, గడికోట రామచంద్రయ్య, రామచంద్రరాజు, నలికిరిరెడ్డయ్య, శంకరనాయుడు, కాశీ, వీవీ రమణ, ప్రభాకరరావు, కత్తి సుబ్బరాయుడు, శ్రీకాంత్, షమీఉల్లాఖాన్, కెఎంఎల్ నరసింహులు తదితరులు పాల్గొన్నారు.

బాధ్యతల స్వీకరణ



వీసీ ఆల్లం శ్రీనివాసులకు అభినందనలు తెలుపుతున్న వైవీయూ ప్రిన్సిపాల్ రఘునాథరెడ్డి

కడప ఎడ్యుకేషన్: యోగివేమన విశ్వ విద్యాలయాన్ని అందరి సహకారంతో అత్యున్నత విద్యా సంస్థగా తీర్చిదిద్దుతామని ఆచార్య ఆల్లం శ్రీనివాసులు పేర్కొన్నారు. నెల్లూరు విక్రం సింహపురి విశ్వవిద్యాలయం ఉపకులపతిగా పనిచేస్తున్న ఆచార్య అల్లం శ్రీనివాసరావు యోగివేమన విశ్వవిద్యాలయం ఇన్చార్జ్ వీసీగా శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా విశ్వవిద్యాలయ కులసచివులు ఆచార్యపుత్తా పద్మ, వైవీయూ కళాశాల ప్రధానాచార్యులు ఎస్. రఘునాథరెడ్డి, ప్రొద్దుటూరు వైవీయూ వైఎస్సార్ ఇంజినీరింగు కళాశాల ప్రధానాచార్యులు ప్రొఫెసర్ జయరామిరెడ్డి, డీన్లు, బీవోఎస్ ఛైర్మన్లు, అన్ని శాఖల అధిపతులు, అధ్యాపకులు, బోధనేతర సిబ్బంది, స్కాలర్లు విద్యార్థులు పుష్పగుచ్ఛాలు అందజేసి అభినందనలు తెలిపారు. యోగి వేమన విశ్వవిద్యాలయానికి ఉపకులపతిగా తనపై నమ్మకంతో బాధ్యతలు అప్పగించిన రాష్ట్ర ప్రభుత్వానికి ధన్యవాదాలు తెలిపారు.

- వైవీయూ వీసీ విశ్వవిద్యాలయ పాలకమండలి సభ్యులతో బేటీ అయ్యారు. ఈ సందర్భంగా ఆయన విశ్వవిద్యాలయ అభివృద్ధికి తన ఆలోచనలను తెలియజేసి సహకరించాలని కోరారు.

నిప్పు.. అంటుకుంటే ముప్పు

50 మామిడిచెట్లు కాలిపోయాయి



నా పేరు మనోహర్. రాయచోటి రూరల్ మండలం ఎండపల్లి. 15 ఏళ్ల కిందట మామిడిచెట్లు నాటి పెంచుకుంటున్నాను. గుర్తుతెలియని వ్యక్తులు కొందరు నిప్పంటించడంతో 50 మామిడి చెట్లు కాలిపోయాయి. 15 ఏళ్లుగా పెంచుకున్న చెట్లు కాలిపోవడంతో ఆర్థికంగా ఇబ్బందిపడ్డాను. తిరిగి ఆ చెట్లను పెంచాలంటే మరో 15 ఏళ్లు ఆగాల్సిందే. ఆకతాయిలు, పశువుల కాపర్లు కానీ అగ్ని విషయంలో జాగ్రత్తలు తీసుకోవాలి.

- అగ్గి మంటలకు బుగ్గిపాలు అవుతున్న పంటలు, అడవులు
- 430 అగ్ని ప్రమాదాలు.. రూ.3.5 కోట్ల ఆస్థి నష్టం
- అప్రమత్తతతోనే ప్రమాదాల నివారణ సాధ్యమంటున్న అగ్నిమాపక అధికారులు



రాయచోటి - సుండుపల్లి మార్గంలో పొలం గట్లపై ఎగిసిపడుతున్న మంటలను అదుపు చేస్తున్న అగ్నిమాపక సిబ్బంది

రాయచోటి: భానుడి భగభగలకు జిల్లా ఉక్కిరిబిక్కిరి అవుతోంది.మండే ఎండలకు తోడు తేమ శాతం తగ్గి ఈ ఏడాది వేసవి ప్రారంభంలోనే అగ్ని ప్రమాదాలు సంభవిస్తున్నాయి.చిన్న నిప్పు రేగినా పెద్ద మంటలు అంటుకుంటున్నాయి. ప్రభుత్వ, ప్రైవేటు ఆస్తులు కాలి బూడిదగా మారుతున్నాయి. ఫలితంగా కోట్లాది రూపాయల్లో నష్టం వాటిల్లుతోంది. అన్నమయ్య జిల్లా వ్యవసాయ ఆధారిత ప్రాంతం కావడంతో గడ్డివాములు, వ్యవసాయ ఉత్పత్తులు చేతికొచ్చిన పంటలు తగలబడి పోతుండటం చూస్తూనే ఉన్నాం. వీటి నివారణకు అగ్నిమాపక అధికారులు పలు సూచనలు చేస్తున్నారు. ముందస్తు జాగ్రత్తలు..

430 అగ్నిప్రమాదాలు

గత ఏడాది ఏప్రిల్ నుంచి ఈ ఏడాది నేటి వరకు జిల్లాలో 430 అగ్నిప్రమాద సంఘటనలు చోటు చేసుకున్నాయి. ఈ ప్రమాదాల కారణంగా 3.5 కోట్ల రూపాయలు ఆస్తి నష్టం సంభవించింది. రూ.12.5 కోట్ల ఆస్తిని రక్షించారు. ఎలాంటి ప్రాణ నష్టం సంభవించలేదు. అగ్నిప్రమాదాల్లో వృక్ష సంపద, దిగుబడికి వచ్చిన పంటలు, వన్యప్రాణులు, పక్షులు, కీటకాలే కాకుండా మనుషుల ఆవాసాలు కూడా అగ్నికి ఆహుతి అవుతున్నాయి.

ప్రమాదాలు సంభవించే సమయంలో తక్షణ చర్యలు తీసుకుంటే ప్రమాద తీవ్రతను, ఆస్తి, ప్రాణ నష్టాన్ని తగ్గించుకోవచ్చని సూచిస్తున్నారు. ప్రైవేటు పాఠశాల భవనాలు, బహుళంతస్తులు నిర్మించే సమయంలో ఫైర్ సేఫ్టీ మెజర్స్ పాటించడం లేదన్న విమర్శలు వినిపిస్తున్నాయి. అగ్నిమాపక సిబ్బంది సర్టిఫికెట్ లేకుండానే విద్యాసంస్థలు, ఆసుపత్రులు, ఇతర భవనాల నిర్మాణాలను పూర్తి చేస్తున్నారన్న ఆరోపణలు ఉన్నాయి. అధికారులు కూడా భవన నిర్మాణాలను ఏమాత్రం పరిశీలించకుండానే సర్టిఫికెట్లు ఇవ్వడం విమర్శలకు తావిస్తోంది.

ఈ జాగ్రత్తలు పాటించాలి

- స్కూళ్లు, ఆసుపత్రులు, షాపింగ్ మాల్స్‌లో అలారాలు ఏర్పాటు చేయాలి
- సెల్లార్లలో ఆటోమేటిక్ స్ప్రిక్లర్లను వాడాలి.
- స్కూళ్లు, ఆసుపత్రిలో బయటకు వెళ్లే ప్రాంతాల్లో ఆటంకాలు లేకుండా చూసుకోవాలి.
- ఇంటి నుంచి ఎక్కువ రోజులు బయటకు వెళ్లాల్సి వస్తే ఎలక్ట్రిక్ మెయిన్ స్విచ్, గ్యాస్ సిలిండర్ రెగ్యులేటర్ ఆఫ్ చేయాలి. గ్యాస్ స్టవ్ రెగ్యులేటర్ పైపును ఆరు నెలలకు ఒకసారి తప్పనిసరిగా మార్చాలి. మండుతున్న స్టవ్‌లో కిరోసిన్ పోయరాదు.
- షార్ట్ సర్క్యూట్ బ్రేకర్స్ పరికరాలను అమర్చుకోవాలి. గోదాములు, గిడ్డంగుల్లో స్టాక్‌ను చెక్క స్లీపర్లపై నిల్వ చేసుకోవాలి.
- కాల్చిన సిగరెట్లు, బీడీ చుట్టలు, అగ్గిపుల్లలు పూర్తిగా ఆర్పకుండా పడేయరాదు.
- పంట పొలాల్లో ఎక్కువగా అగ్నిప్రమాదాలు జరిగే అవకాశం ఉంటుంది. గడ్డివాములు, ధాన్యం తగలబడి భారీ నష్టానికి దారితీస్తాయి. వీటి వద్ద తగిన జాగ్రత్తలు తీసుకోవాలి. గడ్డివాములను ఆవాసాలకు దూరంగా ఉండేలా చూసుకోవాలి.

రైతులకు అధిక నష్టం



వేసవి కాలం వచ్చిందంటే చాలు అగ్నిప్రమాదాలు రోజూ ఎక్కడో ఒకచోట చోటు చేసుకుంటున్నాయి. అగ్ని ప్రమాదాల కారణంగా రైతులు అధికంగా నష్టపోతున్నారు. జిల్లాలో పండ్ల తోటలు సాగు అధికంగా ఉంది. తోటలకు వేసిన కంచె, ఏపుగా పెరిగిన గడ్డి, అటవీ ప్రాంతాల్లో ప్రతి రోజు మంటలు వ్యాపిస్తూ వన్య ప్రాణులను భయభ్రాంతులకు గురిచేస్తున్నాయి.

- బీడు భూములు, పంట పొలాలు, పండ్ల తోటలు, అడవులకు నిప్పంటుకోవడానికి అనేక కారణాలు ఉన్నప్పటికీ, ముఖ్యంగా గుర్తు తెలియని వ్యక్తుల ఆకతాయిల చర్యలు, పశువులను మేతకు అడవులకు తీసుకెళ్లే కాపరుల నిర్లక్ష్యం, పొగాకు పదార్థాలను ఆర్పకుండా పడేయడం, ఉద్దేశపూర్వకంగా నిప్పంటించడం ప్రధాన కారణాలుగా అధికారులు పేర్కొంటున్నారు. బీడీలు, సిగరెట్లు, చుట్టలు పూర్తిగా ఆరనివ్వకుండా పడేయడం వల్ల చిన్న మంట పెద్దిగా మారి అడవిని కబళిస్తోంది.
- మంటల వల్ల ప్రధాన రహదారులకు ఇరువైపులా చెట్లు, పొదలు, కంచెలు కాలిపోతుండటం వాహనదారులకు తీవ్ర అసౌకర్యాన్ని కలిగిస్తోంది. ముఖ్యంగా రాత్రి సమయాల్లో చెలరేగిన మంటల నుంచి పొగ కమ్ముకోవడంతో, ఎదురెదురుగా వచ్చే వాహనాలు స్పష్టంగా కనిపించక ప్రమాదాలు సంభవిస్తున్నాయి. మంటల ధాటికి పండ్లను ఇచ్చే చెట్లు, ప్రకృతి ప్రసాదునిగా ఉన్న వృక్షాలు పూర్తిగా కాలిపోతుండటంతో జీవవైవిధ్యం నాశనమైపోతోంది.
- ఉన్నఫలంగా వ్యాపిస్తున్న మంటలను సిబ్బంది అదుపులోకి తేవడానికి శ్రమిస్తున్నప్పటికీ, పెద్ద ఎత్తున వ్యాపిస్తున్న ఈ అగ్నికీలలను నియంత్రించడం వీలుకాకుండా పోతుంది. జిల్లాలో భారీ స్థాయి పరిశ్రమలు లేకపోయినా తోటలు, పొలాలు, అడవుల్లో పొడి ఆకులు, చెట్ల కొమ్మలు ఎక్కువగా ఉండటంతో, ఒక్కసారి మంటలు వ్యాపిస్తే అవి అదుపులోకి రాకముందే వందలాది ఎకరాలు కాలిపోతున్నాయి.
- మంటల వల్ల పొలాల సమీపంలో ఉన్న వృక్షాలు, పండ్ల తోటలు అగ్నికి ఆహుతవుతున్నాయి. అలాగే వన్యప్రాణులు మంటల ధాటికి అడవుల నుంచి బయటకు పరుగులు తీస్తుండటంతో, అవి జనావాసాల్లోకి వచ్చి ప్రాణాలు కోల్పోతున్నాయి.

అవగాహన అవసరం



వేసవిలో తరచూ ప్రమాదాలు జరుగుతున్నాయి. అగ్ని ప్రమాదాల నివారణపై అవగాహనను పెంచుకోవాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉంది. విద్యుత్‌వినియోగంలో నిర్లక్ష్యం చేయవద్దు. ఇంటి పరిసరాల్లో చెత్త, వృథా వస్తువులు పేరుకుపోకుండా చూసుకోవాలి. జిల్లాలో అగ్ని ప్రమాదాల నివారణే లక్ష్యంగా సిబ్బందిని సమాయత్తం చేస్తున్నాం. –పి.అనిల్‌కుమార్, జిల్లా అగ్నిమాపక అధికారి

సాంకేతిక సహకారంతో అడవుల సంరక్షణ



మాట్లాడుతున్న వైల్డ్‌లైఫ్ సెంట్రల్ బ్యూరో ఇన్‌స్పెక్టర్ ఆదిమల్లయ్య



హాజరైన జిల్లా అటవీశాఖ అధికారులు

బి.కొత్తకోట: విధుల్లో ఉండే అటవీశాఖ యంత్రాంగం అడవులను సంరక్షించుకునేందుకు సాంకేతిక సహకారంతో సత్ఫలితాలు సాధించొచ్చని వైల్డ్‌లైఫ్ సెంట్రల్ బ్యూరో ఇన్‌స్పెక్టర్ (చెన్నై) ఆదిమల్లయ్య, రాజంపేట డీఎఫ్ఓ జగన్నాథ్‌సింగ్, లీగల్ విభాగం న్యాయవాది బలరాం అన్నారు. శుక్రవారం బి.కొత్తకోట మండలంలోని హార్సిలీహిల్స్‌పై జిల్లాలో పని చేస్తున్న క్షేత్రస్థాయి నుంచి జిల్లా స్థాయి అధికారులు 70మందికి వైల్డ్‌లైఫ్, ఏఐ, న్యాయ అంశాలపై ఒకరోజు శిక్షణా తరగతులను నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మారిన చట్టాల మేరకు ఎవరైనా వన్యప్రాణిని చంపితే దానికి విధించే అపరాధ రుసుం భారీగా పెంచారని అన్నారు. గతంలో రూ.25వేల జరిమానా ఉండేదని, ఇప్పుడు రూ.లక్ష నుంచి రూ.ఐదు లక్షల వరకు విధించవచ్చని, డీఎఫ్ఓ స్థాయి అధికారి రూ.5 లక్షలకు మించి విధించే అవకాశం ఉందన్నారు. ఎర్రచందనం ఆక్రమ రవాణా, నిందితులను గుర్తించడం తదితర విషయాల్లో సాంకేతిక సహకారం తీసుకోవాలని సూచించారు. అడవుల్లో అగ్ని ప్రమాదాలు జరిగితే వాటిని గుర్తించే సాంకేతిక విధానం అందుబాటులో ఉందన్నారు. ఎక్కడైనా అడవిలో నిప్పు పడితే అక్కడ వచ్చే పొగ ఆధారంగా శాటిలైట్ అటవీశాఖను అప్రమత్తం చేస్తుందని, ఏ ప్రాంతంలో మంటలు వ్యాపించాయో ఆ ప్రాంత అటవీశాఖ సిబ్బంది మొబైల్ ఫోన్లకు సమాచారం వెళ్తుందని అన్నారు. సిబ్బంది మంటలను అదుపు చేసే చర్యలు తీసుకుంటారని తెలిపారు. అధికారులు, సిబ్బంది చాట్‌జీపీటీని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో సబ్‌డీఎఫ్ఓలు సుబ్బరాజు, బాలరాజు, శ్రీనివాసులు,ఎఫ్ఆర్ఓలు జయప్రసాద్ రావు, వైసీ.రెడ్డి, ప్రభాకర్‌రెడ్డి, ప్రియాంక, శ్యామసుందర్, ధీరజ్, దత్తాత్రేయ, హార్సిలీహిల్స్ సెక్షన్ ఆఫీసర్ అడపా శివకుమార్ తదితరులు పాల్గొన్నారు.

ఎన్నికల ప్రక్రియ బలోపేతానికి సలహాలివ్వండి

కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి చామకూరి శ్రీధర్



ఈవీఎం గోదామును రాజకీయ పార్టీ ప్రతినిధులతో కలిసి పరిశీలిస్తున్న కలెక్టర్ శ్రీధర్

రాయచోటి: జిల్లాలో ఎన్నికల ప్రక్రియను మరింత బలోపేతం చేయడానికి చట్టానికి అనుగుణంగా సూచనలు, సలహాలు అందజేయాలని జిల్లా కలెక్టర్ చామకూరి శ్రీధర్ రాజకీయ పార్టీలను కోరారు. శుక్రవారం రాయచోటి కలెక్టరేట్‌లోని మినీ వీడియో కాన్ఫరెన్స్ హాల్‌లో రాజకీయ పార్టీ ప్రతినిధులతో సమావేశం నిర్వహించారు. ఎన్నికల ప్రక్రియ గురించి ఈఆర్ఓ, డీఈఓల స్థాయిలో పరిష్కారం కాని సమస్యలకు సంబంధించి భారత ఎన్నికల సంఘం అన్ని జాతీయ, రాష్ట్ర రాజకీయ పార్టీల నుంచి సూచనలు ఆహ్వానిస్తోందన్నారు. భారత ఎన్నికల సంఘం సూచించిన ప్రజా ప్రాతినిధ్యం, చట్టం, ఓటర్ల నమోదు నియమాలు, ఎన్నికల నియమాలు నిర్వహణ, గౌరవ సుప్రీంకోర్టు ఆదేశాలు, భారత ఎన్నికల సంఘం ఎప్పటికప్పుడు జారీ చేసే సూచనలు, మాన్యువల్స్, హ్యాండ్ బుక్కులు అంశాలపై అన్ని జాతీయ, రాష్ట్ర రాజకీయ పార్టీల నుంచి ఏప్రిల్ 30 నాటికి సూచనలు, సలహాలు అందజేయాల్సి ఉందన్నారు.ఎన్నికల సంఘం మార్గదర్శకాలను అనుసరించి జిల్లాలో పటిష్టమైన ఓటరు జాబితా రూపొందించేందుకు కృషి చేస్తున్నట్లు వివరించారు. రాజకీయ పార్టీలు బూత్ లెవల్ ఏజెంట్లను తప్పనిసరిగా నియమించుకోవాలన్నారు. గత ఏడాది జరిగిన సార్వత్రిక ఎన్నికల్లో రెండు చోట్ల ఈవీఎంలను పగులకొట్టేందుకు ప్రయత్నించారని, సమస్యాత్మక పోలింగ్ కేంద్రాలను గుర్తించి పటిష్ట చర్యలు తీసుకోవాలని రాజకీయ పార్టీల ప్రతినిధులు కలెక్టర్‌ను కోరారు.

ఈవీఎం గోదాం సందర్శన

స్థానిక మార్కెట్ యార్డు ఆవరణలో ఉన్న ఈవీఎం గోదామును రాజకీయ పార్టీ ప్రతినిధులతో కలిసి కలెక్టర్ సందర్శించారు. గోదాంలోని ఈవీఎంల బీయూ, సీయూ, వివిధ ప్యాట్‌లను వారు పరిశీలించారు. కార్యక్రమంలో డీఆర్ఓ మధుసూదన్‌రావు, కలెక్టర్ ఎన్నికల విభాగం సూపరిటెండెంట్ రెడ్డప్ప, తహసీల్దార్ నరసింహ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

అడవుల సంరక్షణ అందరి బాధ్యత



విద్యార్థినికి బహుమతి అందజేస్తున్న ట్రైనీ ఐఎఫ్ఎస్ అధికారి శ్రీకాంత్

ఒంటిమిట్ట: అడవుల సంరక్షణ ప్రతి ఒక్కరి బాధ్యత అని ఒంటిమిట్ట ట్రైనీ ఐఎఫ్ఎస్ అధికారి శ్రీకాంత్ అన్నారు. ప్రపంచ అటవీ దినోత్సవాన్ని పురస్కరించుకొని శ్రీ సాయి భారతి ఉన్నత పాఠశాలలో శుక్రవారం ప్రత్యేక కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా అడవులు ప్రాముఖ్యత, వాటి సంరక్షణ అవసరం, అటవీ చట్టాల పాత్ర తదితర అంశాల గురించి ఆయన వివరించారు. అనంతరం శ్రీకాంత్ మాట్లాడుతూ అడవులు వాతావరణ సమతుల్యతను కాపాడతాయన్నారు. అడవుల వినాశనం పెరుగుతున్న నేపథ్యంలో ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి వాటిని రక్షించేందుకు కృషి చేయాలన్నారు. ఈ సందర్భంగా విద్యార్థులకు వ్యాసరచన, వక్తృత్వ పోటీలు నిర్వహించారు. విజేతలకు బహుమతులు, సర్టిఫికెట్లు అందజేశారు.కార్యక్రమంలో పాఠశాల కరస్పాండెంట్ రామ తులసీ, ఎఫ్ఎస్ఓ బ్రహ్మయ్య, ప్రిన్సిపాల్ సుబ్బరామయ్య, అటవీశాఖ సిబ్బంది పాల్గొన్నారు.

వైఎస్ఆర్ జిల్లా పేరు మార్పు చేస్తూ ఉత్తర్వులు జారీ

కడప సెవెన్‌రోడ్స్: జిల్లా పేరు మార్పు చేస్తూ రాష్ట్ర ప్రభుత్వం శుక్రవారం ఉత్తర్వులు జారీ చేసింది. ఇప్పటివరకు ఉన్న వైఎస్ఆర్ జిల్లా పేరును వైఎస్ఆర్ కడపజిల్లాగా మార్పు చేస్తూ జీఓ ఎంఎస్ నెంబరు 99 విడుదల చేశారు. ఏపీ డిస్ట్రిక్ట్ (ఫార్మేషన్) యాక్ట్-1974 ఆర్/డబ్ల్యు రూల్-4 ఆఫ్ ఏపీ డిస్ట్రిక్ట్ (ఫార్మేషన్) రూల్స్ -1984 మేరకు ఈ ఆదేశాలను రాష్ట్ర ప్రభుత్వ స్పెషల్ చీఫ్ సెక్రటరీ ఆర్‌పీ సిసోడియా ద్వారా కలెక్టర్ కార్యాలయానికి వచ్చాయి. ఈ మేరకు కలెక్టర్ నోటిఫికేషన్‌ను జిల్లా గెజిట్‌లో ప్రచురించి ప్రజల నుంచి సలహాలు, అభ్యంతరాలను ఆహ్వానించాలని ఆదేశించారు. 30 రోజుల్లో అభిప్రాయాలు, అభ్యంతరాలను స్వీకరించి పంపాలని సూచించారు.

కలెక్టర్ కార్యాలయానికి బాంబు బెదిరింపు!

- మాక్ డ్రిల్ అని తెలియడంతో ఊపిరి పీల్చుకున్న సిబ్బంది



మాక్ డ్రిల్‌లో భాగంగా కలెక్టర్ కార్యాలయంలో తనిఖీలు చేస్తున్న డాగ్ స్క్వాడ్

రాయచోటి: కలెక్టర్ కార్యాలయాన్ని బాంబులతో పేల్చేస్తున్నట్లు దుండగుల నుంచి ఫోన్ సమాచారం అందింది. వెంటనే విషయాన్ని జిల్లా ఎస్పీ కార్యాలయానికి తెలియపరిచారు. సమాచారం అందగానే జిల్లా బాంబు స్క్వాడ్, డాగ్స్ స్క్వాడ్‌లు కలెక్టర్ కార్యాలయంలో అణువణువు గాలింపు చేశాయి. కార్యాలయ సిబ్బంది అంతా ఒక్క మారుగా ఉలికిపాటుకు గురయ్యారు. తీరా ఇదంతా జిల్లా పోలీస్ యంత్రాంగం మాక్ డ్రిల్‌లో భాగమని తెలియడంతో అందరూ ఊపిరి పీల్చుకున్నారు. విషయానికి వస్తే శుక్రవారం సాయంత్రం కలెక్టర్ కార్యాలయంలో బాంబు బెదిరింపు వచ్చినపుడు ఎలా స్పందించాలనే దానిపై పోలీసులు మాక్ డ్రిల్ నిర్వహించారు. హుటాహుటిన కలెక్టర్ కార్యాలయానికి చేరుకున్న పోలీసులు, ఉద్యోగులను బయటకు పంపి కార్యాలయంలో అణువణువు తనిఖీ చేశారు.

ఉద్యోగుల అప్రమత్తత కోసం.....

ఉద్యోగులను అప్రమత్తం చేయడం, అత్యవసర పరిస్థితుల్లో ఎలా వ్యవహరించాలో శిక్షణ ఇవ్వడమే మాక్ డ్రిల్ ఉద్దేశమని జిల్లా ఎస్పీ విద్యాసాగర్ నాయుడు అన్నారు. కలెక్టర్ కార్యాలయంలో బాంబు బెదిరింపు వస్తే తీసుకోవాల్సిన జాగ్రత్తలపై సిబ్బందికి అవగాహన కల్పించినట్లు తెలిపారు. ఎక్కడైనా ఇటువంటి సంఘటనలు జరిగినప్పుడు పోలీసులకు ప్రజలు సహకరించాలని ఎస్పీ సూచించారు. కార్యక్రమంలో రాయచోటి పట్టణ సిఐ చలపతి, రిజర్వ్ ఇన్‌స్పెక్టర్ వీజే రామకృష్ణ, సీఐలు, ఎస్ఐలు,ఆర్ఎస్ఐలు, ఏఆర్ పోలీసు సిబ్బంది, స్పెషల్ పార్టీ పోలీసులు పాల్గొన్నారు.

నర్సును మోసం చేసిన ఆస్పత్రి మేనేజర్‌పై కేసు

మదనపల్లె : కుటుంబ పోషణ కోసం ఆస్పత్రిలో నర్సుగా చేరిన ఓ యువతిని ప్రేమ పేరుతో లొంగదీసుకుని, పెళ్లి చేసుకుంటానని నమ్మించి మోసం చేసిన ప్రైవేట్ ఆస్పత్రి మేనేజర్‌తో పాటు బెదిరించినందుకు మరో ఇద్దరు వైద్యులపై గురువారం రాత్రి కేసు నమోదు చేసినట్లు వన్‌టౌన్ సీఐ ఎరీషావలీ తెలిపారు. కురబలకోట మండలం తెట్టు పంచాయతీ సింగన్నగారిపల్లెకు చెందిన ఓ యువతి (25) నర్సింగ్ పూర్తిచేసి ఉపాధి కోసం మదనపల్లె పట్టణం బెంగళూరురోడ్డులోని ఓ ఆస్పత్రిలో నర్సుగా చేరింది. అదే ఆస్పత్రిలో మేనేజర్‌గా పనిచేస్తున్న వివాహితుడైన రాజేష్‌రెడ్డి(30) ఆమెకు ప్రేమ పేరుతో దగ్గరయ్యాడు. వివాహం చేసుకుంటానని నమ్మించాడు. దీంతో ఇద్దరూ శారీరకంగా ఒకటయ్యారు. ఆమె గర్భవతి కాగా, మాయమాటలు చెప్పి తిరుపతికి తీసుకువెళ్లి గత ఏడాది ఆగస్టులో అబార్షన్ చేయించాడు. తర్వాత కొంతకాలానికి రాజేష్‌రెడ్డి వివాహితుడనే విషయం తెలుసుకున్న యువతి తనకు ఎందుకు మోసం చేశావని నిలదీసింది. తనకు న్యాయం చేయాలని లేకపోతే చట్టపరంగా పోలీసులను ఆశ్రయిస్తానని ఖరాఖండిగా చెప్పింది. దీంతో పెద్దమనుషుల సహాయంతో పలుమార్లు పంచాయతీలు నిర్వహించి యువతికి నచ్చజెప్పే ప్రయత్నం చేశారు. ఆమె వినకపోగా, తనకు కచ్చితంగా న్యాయం జరగాల్సిందేనని లేకపోతే పోలీస్ కేసు పెడతానని చెప్పింది. దీంతో ఆస్పత్రి యజమాని, వైద్యుడైన రవికుమార్‌రెడ్డి ఆమెను నీకు దిక్కున్న చోట చెప్పుకోమంటూ ఉద్యోగంలో తొలగించి బయటకు పంపేశాడు. ఇదే విషయంలో అంగళ్లుకు చెందిన ఆర్‌ఎంపీ వైద్యుడు రాయుడు యువతిని బెదిరింపులకు గురిచేశాడు. దీంతో తనకు న్యాయం జరగదని నిర్ధారించుకుని, బాధిత యువతి వన్‌టౌన్ పోలీసులను ఆశ్రయించింది. విచారించిన సీఐ ఎరీషావలీ, యువతిని మోసం చేసిన రాజేష్‌రెడ్డి, ఆస్పత్రి వైద్యులు రవికుమార్‌రెడ్డి, ఆర్‌ఎంపీ వైద్యుడు రాయుడులపై కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

విఘ్నేశ్వరునికుంట కబ్జాకు యత్నాలు

- మట్టితో చదునుచేసి ఆక్రమిస్తున్న కబ్జారాయుళ్లు
- కోట్ల విలువైన స్థలం అన్యాక్రాంతం
- పట్టించుకోని ఇరిగేషన్ అధికారులు



విఘ్నేశ్వరునికుంటలో మట్టితోలి చదును చేస్తున్న దృశ్యం

మదనపల్లె : కూటమిప్రభుత్వం అధికారంలోకి వచ్చాక వాగులు, వంకలు, కుంటలు, ప్రభుత్వస్థలాలు...ఒకొక్కటిగా ఆక్రమణకు గురవుతున్నాయి. మదనపల్లె పట్టణం రోజురోజుకీ విస్తరిస్తుండటంతో భూములకు ఉన్న డిమాండ్‌ను సొమ్ము చేసుకోవాలనే ఆశతో రాజకీయ అండను ఆసరాగా చేసుకుని తమ్ముళ్లు యథేచ్ఛగా కబ్జాలకు పాల్పడుతున్నారు. మదనపల్లె మండలం బసినికొండ పంచాయతీ పరిధిలో జాతీయరహదారికి అనుకుని దాదాపు 30 ఎకరాల్లో విఘ్నేశ్వరుని కుంట విస్తరించి ఉంది. జాతీయరహదారి విస్తరణలో భాగంగా కుంట మధ్యలో రోడ్డును ఏర్పాటు చేయడంతో రెండు భాగాలుగా విడిపోయింది. దీంతో కుంట ఓ వైపుకు వెళ్లిపోగా, మరోవైపు ఖాళీస్థలం ఏర్పడింది. హైవేకు ఆనుకుని ఉండటం, కోట్ల విలువైన స్థలం కావడంతో కబ్జారాయుళ్ల తెలివిగా... మట్టి, వ్యర్థాలను తీసుకువచ్చి మెల్లమెల్లగా కుంటను చదునుచేయడం ప్రారంభించారు. ప్రతిరోజు ట్రాక్టర్లలో ఇళ్ల వ్యర్థాలు, మట్టిపెళ్లలు, రాళ్లను తీసుకువచ్చి కుంటకు ఆనుకుని దించడం, ఎవరూ లేని సమయంలో జేసీబీని తీసుకువచ్చి చదునుచేయడం చేస్తున్నారు. దీనిపై స్థానికులు రెవెన్యూ అధికారులకు ఫిర్యాదుచేస్తే, వారు ఇరిగేషన్ డిపార్ట్‌మెంట్‌కు సంబంధించిందిగా పేర్కొని చేతులెత్తేశారు. ఇరిగేషన్ అధికారులు క్షేత్రస్థాయిలో పరిశీలనకు రాకపోవడంతో కబ్జారాయుళ్లు భూమికి దొంగపట్టాలు సృష్టించే పనిలో ఉన్నట్లు తెలిసింది. ఇప్పటికైనా రెవెన్యూ, ఇరిగేషన్ అధికారులు సంయుక్తంగా విఘ్నేశ్వరునికుంట సర్వే నిర్వహించి ప్రభుత్వ స్థలం అన్యాక్రాంతం కాకుండా కాపాడాలని స్థానికులు కోరుతున్నారు.

గుర్తు తెలియని వాహనం ఢీకొని వృద్ధుడు మృతి



మృతి చెందిన వృద్ధుడు

బి.కొత్తకోట : జాతీయరహదారి పక్కన నడిచి వెళ్తున్న వృద్ధుడిని గుర్తు తెలియని వాహనం ఢీకొనడంతో దుర్మరణం చెందాడు. ఈ ఘటన శుక్రవారం ఉదయం మండలంలోని పెద్దపల్లి క్రాస్‌లో చోటుచేసుకుంది. సీఐ జీవన్ గంగనాథ్‌బాబు కథనం మేరకు.. తుమ్మనంగుట్ట, కనికలతోపు, పెద్దపల్లి ప్రాంతాల్లో మూడునెలలుగా గుర్తు తెలియని వ్యక్తి (65) భిక్షాటన చేసుకొంటూ సంచరిస్తున్నాడు. ఇతను ఉదయం 7-8 గంటల మధ్యలో మదనపల్లె వైపు నుంచి కదిరివైపునకు వెళ్తున్న గుర్తు తెలియని వాహనం ఢీకొంది. ఈ ఘటనలో తల, శరీరంపై తీవ్ర గాయాలైన వృద్ధుడు ఘటనా స్థలంలోనే మృతి చెందాడు. సమాచారం అందుకున్న సీఐ ఘటనా స్థలికి చేరుకుని దర్యాప్తు చేపట్టారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం మదనపల్లె జిల్లా ఆస్పత్రికి తరలించి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

నడిరోడ్డుపై మృతదేహంతో నిరసన



మూడు రోడ్ల కూడలిలో బైఠాయించి నిరసన తెలుపుతున్న గ్రామస్తులు

తంబళ్లపల్లె : నవీన్‌కుమార్ కుటుంబానికి న్యాయం చేయాలని గ్రామస్తులు, మృతుని కుటుంబీకులు, స్నేహితులు మృతదేహాన్ని దుకాణం ముందు రోడ్డుపై ఉంచి శుక్రవారం నిరసన తెలిపారు. మదనపల్లె జిల్లా ఆస్పత్రిలో నవీన్ మృతదేహానికి పోస్టుమార్టం నిర్వహించిన అనంతరం మృతదేహాన్ని తంబళ్లపల్లెకు తీసుకువచ్చారు. పుడమి కిసాన్‌మార్ట్ దుకాణం ముందు రోడ్డుపై మృతదేహాన్ని ఉంచి నిరసన వ్యక్తం చేశారు. అనంతరం మూడురోడ్ల కూడలిలో రోడ్డుపై బైఠాయించి వాహనాల రాకపోకలను అడ్డుకున్నారు. దుకాణం మేనేజర్ కృష్ణమూర్తి అవకతవకలకు పాల్పడి తమ బిడ్డ మృతికి కారణమయ్యాడని ఆరోపించారు. అతనిపై సమగ్ర విచారణ జరిపి తమకు న్యాయం చేయాలని నినదించారు. ఎస్ఐ లోకేష్‌రెడ్డి నిరసనకారులతో చర్చించి సమగ్ర విచారణ చేసి న్యాయం చేస్తామని చెప్పినా నిరసనకారులు భీష్మించుకుని కూర్చున్నారు. టీడీపీ ఇన్‌చార్జ్ జయచంద్రారెడ్డి బాధితుడి కుటుంబ సభ్యులను పరామర్శించారు. సంస్థ యాజమాన్యంతో చర్చించి న్యాయం జరిగే విధంగా కృషి చేస్తామని హామీ ఇచ్చారు.

విద్యుత్ అదాలత్‌ను సద్వినియోగం చేసుకోండి



వినియోగదారుల నుంచి ఫిర్యాదులు స్వీకరిస్తున్న విద్యుత్ అదాలత్ సభ్యులు

రాయచోటి టౌన్ : ఫిర్యాదుదారుల కోసం ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన విద్యుత్ అదాలత్‌ను వినియోగదారులు సద్వినియోగం చేసుకోవాలని విద్యుత్ అదాలత్ చైర్‌పర్సన్ వి. శ్రీనివాస్ ఆంజనేయ మూర్తి (రిటైర్డ్ న్యాయమూర్తి) తెలిపారు. శుక్రవారం రాయచోటి విద్యుత్‌శాఖ వారి కార్యాలయ ఆవరణలో విద్యుత్ వినియోగం వాటిలో వస్తున్న సమస్యలపై అదాలత్ నిర్వహించారు. అదాలత్‌కు వచ్చిన ఫిర్యాదుదారుల నుంచి ఫిర్యాదులను పరిశీలించి వారికి పరిష్కార మార్గం చూపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇలాంటి అదాలత్‌లను వినియోగదారులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. రాయచోటి, లక్కిరెడ్డిపల్లె డివిజన్ పరిధిలోని వినియోగదారుల ద్వారా ఫిర్యాదులను స్వీకరించారు. కార్యక్రమంలో అదాలత్ ఆర్థిక సభ్యులు రు. రామమోహన్ రావు, సాంకేతిక సభ్యులు ఎస్ఎల్ అంజనీ కుమార్, స్వతంత్ర్య సభ్యులు డబ్ల్యు విజయలక్ష్మి, విద్యుత్ శాఖ జిల్లా పర్యవేక్షకులు ఆర్. చంద్రశేఖర్‌రెడ్డి, సీనియర్ అకౌంట్ ఆఫీసర్ సివిబ్రహ్మయ్య, తదితరులు పాల్గొన్నారు.

ఉపాధి లక్ష్యానికి తూట్లు

- ఉపాధిని వ్యవసాయానికి అనుసంధానం చట్టస్ఫూర్తికి విరుద్ధం
- పనులు కల్పించలేకపోతే ఏడాదికి రూ.12వేల భృతిగా చెల్లించాలి
- ఏపీ వ్యవసాయ కార్మిక సంఘం నేతల డిమాండ్



మాట్లాడుతున్న సీపీఐ జిల్లా కార్యదర్శి పి.యల్.నరసింహులు

రాయచోటి అర్బన్ : ఉపాధి హామీపథకం పనులను వ్యవసాయానికి అనుసంధానం చేస్తామని అసెంబ్లీ సమావేశాలలో చెప్పడం చట్ట స్ఫూర్తికి విరుద్ధమని సీపీఐ అనుబంధ ఏపీ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు పండుగోలు మణి, తోపుక్రిష్ణప్ప, సీపీఐ జిల్లా కార్యదర్శి పియల్ నరసింహులు అన్నారు. శుక్రవారం పట్టణంలోని సీపీఐ కార్యాలయంలో ఏపీ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా సర్వసభ్య సమావేశం నిర్వహించారు. వారు మాట్లాడుతూ ఉపాధి పథకాన్ని వ్యవసాయానికి అనుబంధ చేయడానికి ఎట్టి పరిస్థితుల్లో కష్టజీవులు అంగీకరించబోరంటూ హెచ్చరించారు. రాష్ట్రబడ్జెట్‌లో ఒక్కరూపాయిని కూడా కేటాయించని ప్రభుత్వానికి ఉపాధిహామీ పథకాన్ని వ్యవసాయానికి అను సంధానం చేసే నైతికహక్కు లేదన్నారు. అనుసంధానం పేరుతో కూలీలకు ద్రోహం తలపెట్టవద్దంటూ వారు కోరారు. కరువు పరిస్థితులతో తల్లడిల్లుతూ తిండిఅయినా పెట్టండి - పనులు అయినా కల్పించండి అనే నినాదంతో పేదలు, కూలీలు చేసిన పోరాటం ఫలితంగానే 2005లో యూపీఏ ప్రభుత్వం ఉపాధిహామీ చట్టం తీసుకువచ్చిందన్నారు. ఉపాధిపనులను సక్రమంగా కల్పించకపోవడం వలన కూలీల వలసలు తీవ్రమయ్యాయన్నారు. ఉపాధిహామీ పథకం నిధులను పక్కదారి పట్టించకుండా చూడాలన్నారు. మెటీరియల్ కాంపోనెంటును పూర్తిగా రాష్ట్రప్రభుత్వమే భరించాలని కోరారు. కూలీలకు డబ్బులను పోస్టాఫీసు ద్వారా చెల్లించాలని, పెండింగ్‌లో ఉన్న పాతబకాయిలను తక్షణమే చెల్లించాలన్నారు. ఉపాధిహామీ పథకం ద్వారా పనిచేస్తున్న ప్రతి వ్యక్తికి ఉపాధి కల్పించాలని, ఒకవేళ పని కల్పించలేకపోతే వారికి ఉపాధి భృతిగా ఏడాదికి రూ.12 వేల చొప్పున అందజేయాలని కోరారు. సమావేశంలో రైల్వేకోడూరు, రాజంపేట ,తంబళ్ళపల్లె, మదనపల్లె, పీలేరు,రాయచోటి ప్రాంతాల సంఘం నేతలు పాల్గొన్నారు.

జిల్లా ఆస్పత్రి వైద్యుల నిర్లక్ష్యంపై ధర్నా

- రోడ్డుపై బైఠాయించి నిరసన తెలిపిన బాధితులు
- డాక్టర్లను సస్పెండ్ చేయాలని డిమాండ్



జిల్లా ఆస్పత్రి ఎదుట రోడ్డుపై బైఠాయించి నిరసన తెలుపుతున్న బాధితులు

మదనపల్లె : ప్రభుత్వ జిల్లా ఆస్పత్రిలో వైద్యుల నిర్లక్ష్యం కారణంగా రోగుల ప్రాణాలు గాల్లో కలిసిపోతున్నాయని బాధిత కుటుంబ సభ్యులు, బంధువులు శుక్రవారం జిల్లా ఆస్పత్రి ఎదుట రోడ్డుపై బైఠాయించి నిరసన తెలిపారు. తంబళ్లపల్లె నియోజకవర్గం కురబలకోట మండలం సాయిబులవారిపల్లెకు చెందిన హసన్‌సాబ్ కుమారుడు మౌలాలి(25) గురువారం సాయంత్రం ఇంటి వద్ద నుంచి వస్తుండగా, ముదివేడు క్రాస్ వద్ద ఎదురుగా వస్తున్న మరో ద్విచక్రవాహనం ఢీకొని తీవ్రంగా గాయపడ్డాడు. పోలీసుల సహాయంతో గాయపడ్డ బాధితుడిని 108 అంబులెన్స్ వాహనంలో కుటుంబసభ్యులు మదనపల్లె జిల్లా ఆస్పత్రికి తరలించారు. అత్యవసర విభాగంలో చికిత్సలు పొందుతూ మౌలాలి మృతి చెందాడు. వైద్యులు సకాలంలో స్పందించలేదని, మెరుగైన చికిత్స అందించకపోవడంతోనే మౌలాలి మృతి చెందాడని ఆరోపిస్తూ రాత్రి నిరసనకు దిగారు. ఇదే విషయమై శుక్రవారం ఉదయం మరోసారి నిరసనకు దిగారు. బంధువులు, కుటుంబీకులు, గ్రామస్తులతో కలిసి అత్యవసర విభాగాన్ని ముట్టడించారు. ప్రమాదం జరిగిన గంట వరకు మౌలాలి బతికే ఉన్నాడని, అంబులెన్స్‌లో తీసుకువచ్చేటప్పుడు వాహనంలో ఆక్సిజన్ సిలిండర్ లేదన్నారు. తర్వాత ఆస్పత్రికి చేరుకునేంతవరకు ప్రాణాలతో ఉన్న మౌలాలి, ఆస్పత్రిలోకి వెళ్లిన 5 నిమిషాలలోపే ప్రాణం వదలడమేంటని ప్రశ్నించారు. అనంతరం జిల్లా ఆస్పత్రి ఆర్ఎంఓ షుకుర్, ఆందోళనకారులతో చర్చించేందుకు రాగా వైద్యులపై చర్యలు తీసుకుని సస్పెండ్ చేయాలని డిమాండ్ చేశారు. రూరల్ సీఐ సత్యనారాయణ చొరవతీసుకుని, ఆందోళనకారులతో, ఆస్పత్రి వైద్యులతో మాట్లాడి, న్యాయం చేస్తామని బాధితులకు హామీ ఇవ్వడంతో నిరసన విరమించారు.

ఉరివేసుకొని యువకుడు మృతి

సంబేపల్లె : మండల పరిధిలోని నారాయణరెడ్డిపల్లె పంచాయతీ యర్రగుంట్ల హరిజనవాడకు చెందిన సుండుపల్లె సాయికుమార్ (23) అనే యువకుడు ఉరి వేసుకొని మృతి చెందాడు. పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. సాయికుమార్ గత కొంత కాలంగా అనారోగ్యంతో బాధపడుతున్నట్లు తెలిపారు. ఈ క్రమంలోనే గురువారం సాయంత్రం ఇంట్లో ఫ్యాన్‌కు ఉరి వేసుకొన్నట్లు తెలిపారు. విషయం తెలుసుకున్న కుటుంబ సభ్యులు చికిత్స నిమిత్తం రాయచోటి ప్రభుత్వం ఆసుపత్రికి తరలించారు. అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు తెలిపారు. శుక్రవారం మృతిడి కుటుంబ సభ్యుల పిర్యాదు మేరకు సంబేపల్లె పోలీసులు కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

రోడ్డుపై పడి ప్రైవేటు ఉద్యోగి మృతి

మదనపల్లె : మందులు కొనుగోలు చేసేందుకు వచ్చి, అనారోగ్యం కారణంగా స్పృహ తప్పి రోడ్డుపై పడి ప్రైవేటు ఉద్యోగి మృతి చెందిన సంఘటన శుక్రవారం మదనపల్లి పట్టణంలో జరిగింది. శేషమహల్ ఏరియాలో నివసిస్తున్న సుబ్రమణ్యం (45) పట్టణంలోని దేవత డిజిటల్స్ లో మేనేజర్‌గా పని చేస్తున్నాడు. మందుల కొనుగోలుకై ద్విచక్ర వాహనంలో ఇంటి వద్ద నుంచి ఎన్టీఆర్ సర్కిల్ కు వచ్చాడు. వాహనం నిలిపి మందులు కొనుగోలు చేసేందుకు వెళుతూ ఒక్కసారిగా స్పృహ తప్పి నడిరోడ్డుపై పడిపోయాడు. దీంతో తలకు తీవ్ర గాయమై అపస్మారక స్థితికి వెళ్లాడు. గమనించిన స్థానికులు వెంటనే ప్రభుత్వ జిల్లా ఆస్పత్రికి తరలించారు. పరీక్షించిన అత్యవసర విభాగ వైద్యులు అప్పటికే మృతి చెందినట్లు నిర్ధారించారు.

ఏనుగుల దాడి నుంచి పొలాలను కాపాడండి



మాట్లాడుతున్న వంగిమళ్ల రంగారెడ్డి

రాయచోటి అర్బన్ : చిత్తూరు-తిరుపతి-అన్నమయ్య జిల్లాల్లో ఏనుగుల దాడి నుంచి పంటపొలాలను కాపాడాలని ఏపీ రైతుసంఘం జిల్లా అధ్యక్షుడు వంగిమళ్ళ రంగారెడ్డి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. శుక్రవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ తిరుపతి జిల్లాలో ఎర్రావారిపాళెం, చిన్నగొట్టిగల్లు, చంద్రగిరి, అన్నమయ్య జిల్లాలో ఓబులవారిపల్లె, చిత్తూరు జిల్లాలోని పలమనేరు, వై.కోట, రామకుప్పం, బంగారుపాళెం, మండలాల్లోని పొలాలు, మామిడి తోటలపై ఏనుగులు దాడిచేసి పంటనష్టాన్ని కలిగించాయన్నారు. ఏనుగుల దాడుల్లో అన్నమయ్య జిల్లాలో ముగ్గురు, చంద్రగిరి వద్ద ఒకరు, ఇన్నగొట్టిగల్లు వద్ద ఒకరు చొప్పున మృత్యుపాలయ్యారన్నారు. దీంతో అటవీ సమీప ప్రాంత రైతులు భయాందోళనలకు గురవుతున్నారన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం ఏనుగుల దాడుల్లో మృతిచెందిన వారి కుటుంబాలకు రూ. 10 లక్షలు చొప్పున నష్టపరిహారం అందివ్వాలన్నారు. నష్టపోయిన పంటలను సైతం అంచనావేసి నష్టపరిహారం చెల్లించడం ద్వారా రైతాంగాన్ని ఆదుకోవాలంటూ కోరారు.

కట్నం వేధింపులపై ఫిర్యాదు



చంటి పిల్లలతో బాధిత మహిళ లలితమ్మ

పెద్దతిప్పసముద్రం : అదనపు కట్నం కోసం కట్టుకున్న భర్తతో పాటు అత్తా, మామ, ఆడపడచు వేధిస్తున్నారని లలితమ్మ అనే బాధితురాలు శుక్రవారం పోలీసులకు ఫిర్యాదు చేసింది. వివరాలిలా.. మండలంలోని సంపతికోట పంచాయతీ ముంతపోగులవారిపల్లికి చెందిన కోనకుంట రాయుడు కుమార్తె లలితమ్మకు కర్ణాటక రాష్ట్రం చేలూరు సమీపంలోని గ్యాదోల్లపల్లికి చెందిన బంగారప్ప కుమారుడు క్రాంతి కుమార్‌తో నాలుగేళ్ళ కితం వివాహమైంది. మూడేళ్ళ పాటు ఈ దంపతుల జీవనం సజావుగా సాగింది. ఈ దంపతులకు ఓ కుమార్తె సంతానం కాగా ఇటీవల మరో కుమార్తె జన్మనిచ్చింది. అయితే గత ఏడాది నుంచి తనను ఏ మాత్రం పట్టించుకోకుండా మరో మహిళతో గుట్టుగా అక్రమం సంబంధం పెట్టుకున్నాడని ఆరోపిస్తూ లలితమ్మ భర్తపై నెల రోజుల క్రితం పీటీఎం పోలీసులకు ఫిర్యాదు చేసింది. అయితే అప్పట్లో పోలీసులు భర్తతో పాటు వారి కుటుంబ సభ్యులను పిలిపించి కౌన్సెలింగ్ ఇచ్చి పంపించేశారు. ఈ తరుణంలో తన భర్తలో ఎలాంటి మార్పు లేకపోవడంతో పాటు బి.కొత్తకోటలోని ఇందిరమ్మ కాలనీలో అక్రమ సంబంధం పెట్టుకున్న మహిళతో లలితమ్మ కుటుంబ సభ్యులకు పట్టుబడ్డాడు. తన భర్తతో పాటు ఆమె కుటుంబ సభ్యులు నిత్యం అదనపు కట్నం కోసం వేధింపులకు గురి చేస్తున్నారని, కట్టుకున్న భార్యతో పాటు పిల్లలను పట్టించుకోకుండా నిర్లక్ష్యం చేస్తున్న అత్తామామ, ఆడ పడచుతో పాటు తన భర్తతో అక్రమ సంబంధం పెట్టుకున్న మహిళపై కేసు నమోదు చేయాలని పోలీసులకు ఫిర్యాదు చేసినట్లు లలితమ్మ పేర్కొంది. ఈ విషయంపై ఎస్ఐ హరిహర ప్రసాద్ మాట్లాడుతూ లలితమ్మ ఫిర్యాదును స్వీకరించి విచారణ చేస్తున్నామని తెలిపారు.

జాతీయ రహదారిపై టిప్పర్ కంటైనర్ ఢీ

- టిప్పర్ డ్రైవర్ మృతి
- కంటైనర్ డ్రైవర్ పరిస్థితి విషమం





టిప్పర్ లారీ ఢీ కొన్న దృశ్యం (ఇన్‌సెట్) మృతి చెందిన చీమకుర్తి శివ

పుల్లంపేట : కడప-రేణిగుంట జాతీయ రహదారిపై పుల్లంపేట మండలం, ఏపీ మోడల్ స్కూల్ సమీపంలో శుక్రవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో టిప్పరు, కంటైనర్ ఢీ కొన్నాయి. టిప్పర్ డ్రైవర్ మృతి చెందగా కంటైనర్ డ్రైవర్ పరిస్థితి విషమంగా మారింది. వివరాల్లోకి వెళ్తే.. రాజంపేట మండలం, ఊటుకూరు గ్రామానికి చెందిన చీమకుర్తి శివ (35) టిప్పర్ డ్రైవర్‌గా జీవనం సాగిస్తున్నాడు. ఈ నేపథ్యంలో శివ శుక్రవారం మంగంపేట నుంచి టిప్పర్‌లో రాజంపేటకు వస్తుండగా ముందు వెళ్తున్న వాహనాన్ని ఓవర్ టేక్ చేయబోయి ఎదురుగా గుజరాత్ నుంచి చెన్నైకు వెళ్తున్న కంటైనర్ వాహనాన్ని బలంగా ఢీ కొనడంతో శివ అక్కడికక్కడే దుర్మరణం చెందారు. కంటైనర్ డ్రైవర్ పాండు తీవ్రంగా గాయపడ్డాడు. ఏఎస్పీ రామనాథ్ హెడ్డే, రూరల్ సీఐ రమణ, పుల్లంపేట ఏఎస్ఐ పిచ్చయ్యలు తమ సిబ్బందితో సంఘటనా స్థలాన్ని పరిశీలించి గాయపడిన కంటైనర్ డ్రైవర్ పాండును రాజంపేట ప్రభుత్వ ఆసుపత్రికి తరలించగా పరిస్థితి విషమంగా ఉండటంతో మెరుగైన చికిత్స కోసం తిరుపతికి తరలించారు. శివ మృతదేహం టిప్పర్‌లో ఇరుక్కుపోగా జేసీబీ సహాయంతో వెలికితీసి పోస్టుమార్టం నిమిత్తం రాజంపేట ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. కాగా రెండు భారీ వాహనాలు ఢీ కొని రోడ్డుకు అడ్డంగా నిలిచిపోవడంతో సుమారు మూడు గంటలసేపు ట్రాఫిక్ స్తంభించిపోయింది. పోలీసులు జేసీబీల సహాయంతో రెండు వాహనాలను ప్రక్కకు తొలగించి ట్రాఫిక్‌ను పునరుద్ధరించారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

హైకోర్టు ఆదేశాల మేరకు దారి ఏర్పాటు చేయండి



తహసీల్దార్ కార్యాలయం వద్ద నిరసన వ్యక్తం చేస్తున్న సీపీఎం నాయకులు, రైతులు

రైల్వేకోడూరు అర్బన్ : మండలంలోని కొత్తపల్లి గ్రామంలో రాజకీయ కారణాలతో అగ్రవర్ణ భూస్వాములు కంచె వేసి దారిని ఆక్రమించారని, హైకోర్టు ఆదేశాల మేరకు రెవెన్యూ అధికారులు రైతులకు దారి ఏర్పాటు చేయాలని శుక్రవారం సీపీఎం నాయకుడు సిహెచ్ చంద్రశేఖర్ ఆధ్వర్యంలో తహసీల్దార్ కార్యాలయం వద్ద నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ 2016వో ఎన్నో ఏళ్లుగా ఉన్న దారిని మూసేశారని, అప్పటి రెవెన్యూ అధికారులు నోటీసులు ఇవ్వగా స్టే తెచ్చారని వారు పేర్కొన్నారు. దానిపై ప్రస్తుతం హైకోర్టు స్టే రద్దు చేసి నాలుగు వారాలలో దారి ఏర్పాటు చేయాలని రెవెన్యూ అధికారులకు ఆదేశించిందన్నారు. అయినప్పటికీ రెవెన్యూ అధికారులు రాజకీయ నాయకుల అండదండలతో పట్టించుకోవడం లేదని వారు పేర్కొన్నారు. నిర్లక్ష్యం వీడి రైతులకు దారి ఏర్పాటు చేయాలని వారు డిమాండ్ చేశారు. కార్యక్రమంలో మల్లికార్జున రెడ్డి, సుభాన్ బాష, రాజగోపాల్ రెడ్డి, ఓబిలి పెంచలయ్య, బొజ్జా శివయ్య, ఆనంద్, పెంచలయ్య, కేశవులు, నారాయణ, చలపతి, శ్రీను, చిన్నమ్మ, చెంగమ్మ తదితరులు పాల్గొన్నారు.

ప్రకృతి వ్యవసాయాన్ని ప్రోత్సహించండి

చిత్తూరు వ్యవసాయ శాఖ డీడీఏ మధుసూదన్‌రెడ్డి



రైతులతో మాట్లాడుతున్న డీడీఏ మధుసూదన్‌రెడ్డి

గాలివీడు : ప్రస్తుత వాతావరణ పరిస్థితుల దృష్ట్యా రైతులు ప్రకృతి వ్యవసాయాన్ని ప్రోత్సహించాలని చిత్తూరు వ్యవసాయ శాఖ డీడీఏ మధుసూదన్‌రెడ్డి రైతులకు సూచించారు.ఆయన శుక్రవారం పూలుకుంట గ్రామంలో ఉలవల పంపిణీ, ఉలవ పంట సాగుపై బండమీద పల్లి, రెడ్డివారి పల్లెలో క్షేత్రస్థాయిలో పరిశీలించారు. పంట సాగుపై రైతుల దగ్గర నుంచి వివరాలను సేకరించారు. అనంతరం గ్రామ పంచాయతీ కార్యాలయంలో సర్పంచ్ పార్థసారథి రెడ్డి ఆధ్వర్యంలో రైతులతో సమావేశాన్ని నిర్వహించారు. సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఖరీఫ్ సీజన్లో ప్రభుత్వం అందించిన ఉలవల ద్వారా అధిక విస్తీర్ణంలో ఈ ప్రాంతంలో రైతులు సాగు చేశారని, దిగుబడి కూడా ఎక్కువగా ఉన్నదని తెలిపారు. ప్రతి రైతు పంట మార్పిడి ద్వారా భూ సారాన్ని కాపాడాలని తెలిపారు. అనంతరం ఉలవ పంట సాగుచేసిన రైతులను అభినందించారు. కార్యక్రమంలో ఏడీఏ శివప్రసాద్,ఏవో గౌతమి, ఏపీఎంవీపీ డీసీఓ శివశంకర్, మాజీ సర్పంచ్ నాగన్న, మాజీ సొసైటీ డైరెక్టర్ కొండారెడ్డి, రైతులు నాగేశ్వరరావు, గోపాలయ్య తదితరులు పాల్గొన్నారు.

కుటుంబ కలహాలతో అల్లుడిపై దాడి



దాడిలో గాయపడిన పసుపుల వెంకటరమణ

లక్కిరెడ్డిపల్లి : కుటుంబ కలహాల నేపథ్యంలో అల్లుడు పసుపుల వెంకటరమణపై అత్తా, మామలతోపాటు మరో ఇద్దరు కలిసి పట్టపగలు అందరూ చూస్తుండగానే వేట కొడవళ్లతో దాడి చేసిన సంఘటన లక్కిరెడ్డిపల్లి మండలం, పందిళ్లపల్లి గ్రామం, జింకలగట్టు వడ్డిపల్లిలో చోటు చేసుకుంది. స్థానికల వివరాల మేరకు .. పసుపుల వెంకటరమణకు 20 సంవత్సరాల క్రితం వివాహమైంది. ముగ్గురు సంతానం. అయితే పసుపుల వెంకటరమణ భార్యకు అంతకు మునుపే మరో మరో వ్యక్తితో వివాహమైందని, అప్పటికే ఇద్దరు సంతానం కూడా ఉన్నారని బంధువులు తెలిపారు. శుక్రవారం సాయంకాలం సమయంలో పసుపుల వెంకటరమణ తన ఇంటి వద్ద ఆరుబయట కూర్చొని ఉండగా అత్తా, మామలు, భార్య, ముందు సంతానం అయిన ఇద్దరితో కలిసి ఒక్కసారిగా కొడవళ్లతో పసుపుల వెంకటరమణపై దాడి చేసినట్లు స్థానికులు తెలిపారు. ఈ మేరకు రక్త గాయాలతో పడి ఉన్న పసుపుల వెంకటరమణను స్థానికులు 108 సాయంతో లక్కిరెడ్డిపల్లి ఏరియా ఆసుపత్రికి తరలించారు. అక్కడి నుంచి మెరుగైన వైద్యంకోసం కడపరిమ్స్‌కు తరలించారు. లక్కిరెడ్డిపల్లి పోలీసులు ఘటనా స్థలానికి చేరుకొని జరిగిన విషయంపై స్థానికులు ద్వారా సమాచారాన్ని సేకరించారు. పసుపుల వెంకటరమణపై దాడికి పాల్పడిన వారు పరారీలో ఉన్నట్లు స్థానికులు తెలిపారు. ఈ విషయంపై లక్కిరెడ్డిపల్లి ఎస్ఐ రవీంద్రబాబును సాక్షి వివరణ కోరగా స్టేషన్‌లో ఇప్పటి వరకు ఫిర్యాదు ఇవ్వలేదన్నారు.